క్లుప్తంగా

డాక్టర్ ఏవీ రావుకు వైద్యుల సంఘం అభినందన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఏ.వెంకటేశ్వరరావుకు ప్రభుత్వ వైద్యుల సంఘం(జీడీఏఏపీ) సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘ సభ్యులు డాక్టర్ శ్యామ్ బాబ్జికుమార్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎస్ ప్రభాకర్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్రీనివాసరావు, డాక్టర్ బి.శ్రీనివాసరావు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై సమీక్ష



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు కూడా ఆయా విభాగాల అధికారులకు సహకరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు విజయవాడ కమిషనరేట్ పోలీసులు, ట్రావెల్ అసోసియేషన్ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను రోడ్లపై నిలపరాదన్నారు. ప్రజలకు ట్రాఫిక్ సంబంధిత అంతరాయం లేకుండా బస్సులు, కార్లు పార్కింగ్ చేసుకోవాలని లేని పక్షంలో తాము శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రసన్న కుమార్, ఇతర ట్రాఫిక్ సిబ్బంది, ఆంధ్రప్రదేశ్–తెలంగాణ బస్ ఆపరేటర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్‌ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ వై. బాల రాజాజీ శనివారం సత్యనారాయణపురం, రామకోటి మైదానం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపే చోదకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎటువంటి పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ బాల రాజాజీ మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని, అటువంటి చర్యలకు పాల్పడితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ షబ్బీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సినీ ఆర్టిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీరంగంలోని నటీనటులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సౌత్ ఇండియన్ ఫిలిం ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నటీనటులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సినిమా ఆర్టిస్టుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు అశోక్, కావ్య, కార్యదర్శి కొండిశెట్టి సురేష్‌బాబు, సయ్యద్ జాఫర్, సత్య శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో కార్తిక మాసం పురస్కరించుకుని అయ్యప్ప, భవానీ మాలధారులకు అన్నప్రసాద వితరణ శనివారం ప్రారంభమయ్యింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు మాట్లాడుతూ మాలధారులకు నెల రోజుల పాటు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామని తెలిపారు. తొలుత బాబాకు, ఆలయంలోని చంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, మాలధారులు అన్న ప్రసాదం స్వీకరించారు.

కాంగ్రెస్ సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా రాజేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కాంగ్రెస్ పార్టీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా సీనియర్ నాయకుడు మీసాల రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటు బస్సుల పార్కింగ్‌తో ఇక్కట్లు

- రోడ్డుకు ఇరువైపులా బస్సుల నిలిపివేత
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



బావాజీపేటలో రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేసిన ప్రైవేటు బస్సులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హనుమాన్‌పేట ట్రావెల్ ఏజెన్సీలకు అడ్డాగా మారింది. నగరం మధ్యలో ఉండటంతో ఇక్కడ పదుల సంఖ్యలో ట్రావెల్ ఏజెన్సీలు వెలిశాయి. ఇక్కడ నుంచే రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు నిత్యం ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వైజాగ్, అనంతపురం ఇలా రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లాలన్నా, చివరికి ఇతర రాష్ట్రాలు, హైదరాబాద్, బెంగుళూరు వంటి ప్రాంతాలకు ఇక్కడి నుంచే బస్సులు వెళ్తూ వస్తూ ఉంటాయి. చుట్టూ వ్యాపార, వాణిజ్య కేంద్రాలు ఉండటంతో ఇక్కడ నుంచి ప్రైవేటు బస్సుల ద్వారా సరుకు రవాణా జరుగుతుంది. దీంతో హనుమాన్‌పేట, బావాజీపేట రోడ్డుకు ఇరువైపులా ప్రైవేటు బస్సులు పార్క్ చేస్తున్నారు. రోడ్డు చిన్నది కావడం, దానికి ఇరువైపులా బస్సులు పార్క్ చేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకి వచ్చే బస్సుల్లో సగం హనుమాన్‌పేటలోనే రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రయాణికులను ఎక్కించుకోవడంతో పాటు రోడ్డుపైనే బస్సులు నిలిపి సరుకు లోడ్ చేస్తున్నారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో హనుమాన్‌పేట వెళ్లాలంటేనే వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది.

ఆర్టీసీ బస్సులకు ఇబ్బంది

బస్టాండ్ నుంచి నూజివీడు, విసన్నపేట, సత్తుపల్లి ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, నగరంలో తిరిగే సిటీ బస్సులు హనుమాన్‌పేట మీదుగా వెళ్తుంటాయి. హనుమాన్‌పేట విశ్వేశ్వరయ్య పార్క్ సెంటర్, గాంధీనగర్ సబ్‌స్టేషన్–పోలీసు క్వార్టర్స్ వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపులోనే రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేసిన ప్రైవేటు బస్సులతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. మలుపులో ప్రైవేటు బస్సులు నిలిపి ఉంచడంతో ఆర్టీసీ బస్సులు తిరగడానికి కష్టంగా మారుతోంది. ఫిర్యాదు చేసినప్పుడు ట్రాఫిక్ పోలీసులు ఒకటి రెండు రోజులు హడావుడి చేయడం తప్ప ఇబ్బందులను శాశ్వతంగా తొలగిపోయేలా చేయడం లేదు. కంట్రోల్ రూం, పాత బస్టాండ్, పీఎన్‌బీఎస్ అవతలి వైపునా రాత్రి సమయంలో ఎక్కడ పడితే అక్కడే నిలిపి ప్యాసింజర్లను ఎక్కించుకుంటున్నారు.

నగర శివారులో స్థలం కేటాయించాలి

ప్రైవేటు ట్రావెల్స్ ప్రతిరోజూ తెల్లవారుజామున నగరంలోకి వచ్చి తిరిగి రాత్రి వెళ్లే వరకు ఇక్కడ పార్క్ చేసి ఉంటున్నాయి. రోడ్లకు ఇరువైపులా పార్క్ చేయకుండా నగర శివారులో ఖాళీ ప్రదేశాల్లో పార్క్ చేసుకునేలా చూడాలి. అలా చేయడం వల్ల పగలంతా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఉంటుందని స్థానికులు, వాహనదారులు సూచిస్తున్నారు. రాత్రి సమయంలో నిర్దేశిత ప్రాంతాల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటూ అంతరాయం లేకుండా వెళ్లవచ్చని చెబుతున్నారు. పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చాలా అసౌకర్యంగా ఉంది



బావాజీపేట రోడ్డులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఈ రోడ్డులో గోరా పార్క్ నుంచి పాత ప్రభుత్వాసుపత్రి వరకు ఇరువైపులా బస్సులు నిలిపివేస్తున్నారు. దీంతో చాలా అసౌకర్యంగా ఉంటుంది. గతంలో పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత షరా మామూలే అన్నట్లు తయారైంది.

– ఉపేంద్ర, స్థానికుడు

ఘనంగా ప్రారంభమైన కార్తిక మాసోత్సవాలు



ముత్యాలంపాడులో రామలింగేశ్వరస్వామి



దీపారాధన చేస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో శనివారం కార్తిక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని దీపారాధనలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం కార్తిక మాసోత్సవాలు గోపూజతో ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు, పూజలు నిర్వహించారు. అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శనివారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన కార్తిక పూజలు నిర్వహించారు. అలాగే మధురానగర్ పప్పులమిల్లు రైల్వేగేటు సమీపంలోని శ్రీ ఉభయ రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో కార్తిక పూజలు నిర్వహించారు.

17న రుద్రాభిషేకం

విజయవాడ కల్చరల్: సనాతన ధర్మరక్షణ పరిరక్షణార్థం అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 17వ తేది సామూహిక మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి టీవీ దశరథ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్‌లోని స్వామి వివేకానంద సెంటనరీ స్కూల్‌లో 108 మంది దంపతులతో రుద్రాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు. బ్రాహ్మణులు, వైశ్యులు, శివస్వాములు, శివ భక్తులు పాల్గొనాలని కోరారు. పూజా సామగ్రి కమిటీ వారు అందజేస్తారని తెలిపారు. వివరాలకు 9618193027, 9246193908 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

6లోగా పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి



ఓటరు నమోదు దరఖాస్తును స్వీకరిస్తున్న శివారెడ్డి, విద్యాసాగర్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా, గుంటూరు జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి జరగనున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులైన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ నెల 6వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పిలుపునిచ్చారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో భాగస్వాములు కావాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకొనేందుకు గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌నందు పశ్చిమ కృష్ణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పరిశీలించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం

అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఓటు నమోదు చేసుకోవాలన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఈ నెల 6వ తేదీ చివరి రోజు కావడంతో ఓటును నమోదు చేసుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా పట్టభద్రులైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఓటరుగా నమోదు చేసుకొని మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు. కృష్ణా గుంటూరు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పట్టభద్రులు ఓటును నమోదు చేసుకొనేందుకు ఎన్జీవో హోమ్‌లలో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి కె.రంగారావు, జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, జి.రామకృష్ణ, ఎం.నాగేంద్ర, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, షేక్.నాజీరుద్దీన్, వీవీ ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి



గ్రాడ్యుయేట్ ఓటు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారితో కిరణ్ రాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లందరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ సూచించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో శనివారం కిరణ్ రాజ్ ఆధ్వర్యాన గ్రాడ్యుయేట్ల ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని దివ్యాంగ గ్రాడ్యుయేట్లందరూ తమ ఓటును ఈ నెల 6వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. అలాగే వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపునకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా భవిష్యత్‌లో గ్రాడ్యుయేట్ల సమస్యలపై శాసనమండలిలో గళం విప్పి, వాటిని పరిష్కరించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, జూబ్లీ ఇండోర్ సబ్‌స్టేషన్ 11కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ గెస్ట్ హౌస్, గోపాలరెడ్డి రోడ్డు, ప్రకాశం రోడ్డు, డోర్నకల్ రోడ్డు, నరసింహారావు నాయుడు వీధి, కాశేశ్వరావు రోడ్, గోవిందరాజులు నాయుడు వీధి, తాడేపల్లివారి వీధి, పీసపాటివారి వీధి, టొబాకో బ్యారెన్ స్ట్రీట్, డాక్టర్ యన్. సుబ్బారావు వీధి, దాసరివారి వీధి, సూర్యనారాయణ వీధి, వేమూరివారి వీధి, జడగంవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సంక్షేమ బోర్డును తక్షణమే పని చేయించాలి

సర్క్యులర్ 1214 రద్దు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పని చేయించి, సర్క్యులర్ 1214ను తక్షణమే రద్దు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, పిల్లి నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాణిగారితోటలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు సరైన ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబాలు గడపటం జీవన మరణ సమస్యగా మారిందని, ప్రభుత్వం నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవడంలో పూర్తిగా వైఫల్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు గతంలోనూ ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేందుకు సంక్షేమ బోర్డు నుంచి డబ్బులు దారి మళ్లించారని ఆరోపించారు.

8న జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు..

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పని చేయించి, ప్రతి కార్మికునికి సంక్షేమ పథకాలను అమలయ్యే విధంగా చూడాలని కోరారు. సంక్షేమ బోర్డులో ఉన్న డబ్బులకు రక్షణ కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సమీక్ష చేసి వారికి న్యాయం చేయాలని, లేకుంటే రాబోయే కాలంలో కార్మికులందరిని ఐక్యం చేసి ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంక్షేమ బోర్డును పని చేయించడంతో పాటు సర్క్యులర్ 1214ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రంలో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులందరూ ఐక్యంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం లేబర్ అధికారులకు, ఎమ్మార్వోలకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటేశ్వరరావు, సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.బాబూరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి బి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఫిర్యాదులు రాకుండా పని చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యలపై ఫిర్యాదులు రాకుండా అధికారులు, సిబ్బంది పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఆదేశించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ఆయన నగరంలోని వార్డు సచివాలయాల ప్రణాళిక, శానిటరీ, ఎమినిటీస్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు వారాలుగా చేస్తున్న సంయుక్త పర్యవేక్షణలో సెక్రటరీలు గుర్తించిన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ, సచివాలయాల ఉద్యోగులు సంయుక్తంగా ఆయా సచివాలయాల పరిధిలో నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. సంయుక్త పరిశీలన చేస్తున్నప్పటికీ ప్రజలకు ఇంకా సమస్యలు ఎందుకు ఎదరవుతున్నాయన్న విషయంపై విశ్లేషించారు. నగరపాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిళ్లలోనూ ఒక్కో సర్కిల్‌కి ఒక సచివాలయం బృందంతో చేసిన సంయుక్త పరిశీలనలో ఏమి గమనించారు, ఎటువంటి సమస్యలను పరిష్కరించారు, ప్రజల స్పందన ఎలా ఉంది అన్న అంశాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.

సమన్వయంతో పని చేయాలి

అనధికార కట్టడాలు, ఖాళీ స్థలాలు, వ్యర్థాలను ఇంటి వద్దే వేరు చేయడం వంటి విషయాలపై కమిషనర్ ధ్యానచంద్ర సెక్రటరీలతో చర్చించారు. ప్లాన్ లేనిదే ఇల్లు కట్టకూడదని, ఖాళీ స్థలాలలో వ్యర్థాలను పడేయకూడదని, తడి – పొడి చెత్తను సెగ్రేషన్ చేయడం అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేస్తే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించగలరని చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజల సమస్యలపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, ఈఈలు, డిప్యూటీ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఏఈలు, సచివాలయం స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సమాజానికి అవినీతి శాపం



వాకథాన్‌లో యూనియన్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజానికి అవినీతి శాపంగా మారిందని, ప్రజాధనానికి సంరక్షకులుగా ఉన్న బ్యాంకర్లపైన ఈ ముప్పును రూపుమాపాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ సీవీఎన్ భాస్కరరావు అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను జోనల్ హెడ్ సీవీఎన్ భాస్కర్‌రావు, రీజినల్ హెడ్ ఎమ్ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా వినియోగదారులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాకథాన్ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ జోనల్ హెడ్ శారదామూర్తి, ఎమ్ఎస్ రామారావు, డెప్యూటీ రీజినల్ హెడ్స్ హరీష్ బేతా, ఐఎస్ఎస్ మూర్తి, సీనియర్ అధికార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): నల్లపాడు, గుంటూరుకు చెందిన జేఎంజే సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం కండ్రిక కమ్యూనిటీ హాలులో 500 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, షెల్టర్ అవసరాలు, మందులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత రెవరెండ్ సిస్టర్ మేరీకుమారి మాట్లాడుతూ వరదల్లో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామని తెలిపారు. అదేవిధంగా నిత్యావసర సరుకులు, షెల్టర్‌కు సంబంధించిన సామగ్రిని అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ హాస్పటల్ సిబ్బంది, జేఎంజే సిబ్బంది పాల్గొన్నారు. సహకారం అందించిన సచివాలయ సిబ్బందికి, యువతకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా జైలులో ముగిసిన ప్రస్థాన సాధన



జిల్లా జైలులో ప్రస్థాన యోగా సాధన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ లోని జిల్లా జైలులో ఆధ్యాత్మిక విశ్వ గురువు, ది సైంటిఫిక్ సెయింట్ శ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి ఆశీస్సులతో ఐదు వారాలుగా నిర్వహిస్తున్న ప్రస్థాన సాధనపై అవగాహన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. శిక్షణ తరగతుల్లో ఖైదీలు ఎంతో శ్రద్ధాశక్తులతో యోగా, ప్రాణాయామ మెడిటేషన్ నేర్చుకుని సాధన చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయుర్వేద వైద్యుడు, రచయిత డాక్టర్ జీవీ పూర్ణచంద్ ఖైదీలకు పలు సూచనలు చేశారు. జైలర్ గణేష్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఖైదీలకు యోగా సాధన సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో విశ్వస్ఫూర్తి ట్రస్ట్ ట్రస్టీ జి. ప్రమీల, స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కోశాధికారి చొప్పరపు నారాయణరావు, డెమానిస్ట్రేటర్ లక్ష్మీనారాయణ, జైల్ సూపరెంటెండెంట్ హసినీపాల్, డెప్యూటీ జైలర్ గోపీనాయక్, స్ఫూర్తి కుటుంబ వలంటీర్లు పాల్గొన్నారు.

'మేడ్' రాష్ట్ర మహాసభ కరపత్రం ఆవిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ ఏపీ(మేడ్) ఆధ్వర్యంలో ఈ నెల 9న గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరణ శనివారం జరిగింది. మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ సారథ్యంలో విద్యాధరపురంలోని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రామయ్య మాట్లాడుతూ గత 7 ఏళ్ల నుంచి దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మేడ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేవపాల్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లోని దళిత ఉద్యోగుల సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారంపై గుణాత్మక కార్యాచరణ అమలు చేసిన ఘనత మేడ్ సంస్థదేనని చెప్పారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు ఏసీ కాలేజీలో రాష్ట్ర మహాసభను నిర్వహిస్తామన్నారు. మేడ్ నాయకులు పున్నారావు, గొడుగు నూరిబాబు, షాలేం రాజు, నలుకుర్తి కిరణ్, కొమ్ము మన్మథకుమార్, శాంతి, పద్మ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 249 మందికి జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): నెల రోజుల వ్యవధిలో మద్యం సేవించి వాహనాలను నడిపిన 249 మందికి న్యాయమూర్తులు జరిమానా విధించారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో ప్రతి రోజూ వివిధ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలను నడిపే చోదకులపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గత నెల 2వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు ట్రాఫిక్ పోలీసులు రాత్రి సమయాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మొత్తం 249 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని సంబంధిత న్యాయస్థానం న్యాయమూర్తులు ఆర్‌వీ శర్మ, లెనిన్ బాబు 249 మందిలో 40 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, మిగిలిన వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు రద్దు చేయాలి

ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్‌ఏ) కూటమి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు వేస్తోందని, తక్షణమే వాటిని రద్దు చేయాలని, పే స్కేల్ అమలు చేసి ఆదుకోవాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు కోరారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు రాత్రి వేళల్లో కార్యాలయాల వద్ద కాపలా, ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వీఆర్‌ఏలు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో వీఆర్‌ఏల జీతాల పెంపు, ప్రమోషన్స్ అమలు వంటి అంశాలపై చర్చించి పరిష్కరించాలని కోరారు. వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ నాలుగో తేదీన కలెక్టరేట్లు, 18వ తేదీన మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వీఆర్‌ఏలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు పాల్గొన్నారు.